
కథ

# కృషితో ఆస్తి దుర్భిక్షం

- మజుందార్



"చూడు మావ ఈ చిల్లర దొంగతనాలు, రాత్రిపూట కన్నాలు వెహికల్ దొంగతనాలు, ఆడవాళ్ల మెడల్లో చెయిన్ లాగుకోవటాలు, చిట్ ఫండ్స్ నడిపించి బోర్డు తిప్పేయటాలు... ఎంతకాలం మాఁవ ఇలా... ఏదైనా చేస్తే భారీ ఎత్తున చెయ్యాలి... హాయిగా బ్రతికేయాలి."

"నీవే చెప్పవే చంద్రీ ఏం చేయమంటావ్? నాకూ చిరాగ్గానే ఉంది. బారులు పెడుతున్నారు. మనమెంతకాలం ఈ చెయిన్ స్నాచింగ్‌లు, ఫైనాన్స్ కంపెనీలు నడిపినా పెద్దగా గిట్టుబాటు కావటంలేదు. మొన్నటికి మొన్నరాత్రి పెద్దబ్యాంకు గదా అంబర్‌పేట బ్యాంకు షట్టర్లు తీసి దూరామా? ఏం దొరికాయి? వోచర్లు, కంప్యూటర్లు, టెలిఫోన్‌లు మొత్తం కలిపినా లక్ష దాటలేదు. ఇంతలో సైరన్ మోగింది. చావుతప్పి కన్ను లొటబోయిందనుకో."

"బ్యాంకంటే గుర్తొచ్చింది. అసలు ఈ బ్యాంకు దొంగతనాలు అవీ మానేసి అసలు మనమే ఒక బ్యాంకు పెడితే?"

"ఏఁవే చంద్రా... ఎగతాళిగా వుందేవిటే? నీవు నాకన్న ఎంత ఎక్కువ చదువుకున్నా... ఇటువంటి సలహాలా ఇచ్చేది?"

"కాదు మాఁవ. నిజంగానే చెబుతున్నాను. చాలా సీరియస్‌గా చెబుతున్నాను.

మనమూ మన తోటివారు... మన క్లోజ్‌ఫ్రెండ్స్... బంధువులు... అందరూ మనం చెప్పినట్లు విని ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ పెట్టేవారే సుమా. అందరిని కలుపుకుని, అందరి డబ్బు పోగేసి ఒక బ్యాంకే పెట్టేద్దాం మావ."

"ఆఁ"

"ఓపియం అంటే తెలుసా మావా నీకు?"

"నల్లమందు"

"అర్థం ఇంచుమించు అదే అనుకో... కరెక్ట్‌గా చెప్పాలంటే అదర్ పీపుల్స్ మనీ అన్నమాట. సొమ్ము ఒకరిది...అంటే ప్రజలన్నమాట... సోకొకరిది అంటే మనమన్న మాట."

"ఆషామాషీగా ఉందేమిటే బ్యాంక్ పెట్టడం అంటే. ఎన్ని కోట్లు కావాలి ఏం కథ?"

"ఎన్నో కోట్లా? ఒక్క సూటు ఉంటే చాలు!"

"నేనంటున్నది ప్యాంట్లూ కోట్లు గాదే... కోట్ల రూపాయలు"

"నీతో వచ్చిన ప్రాబ్లమేయిది. రాత్రంతా ఫామ్ హౌస్ దోపిడీలని, వెహికల్ లిఫ్టింగని.. డ్యూటీకి వెళ్తావు. పగలు నిద్రపోతావ్. పేపరు చదివే తీరికే ఉండదు. దేశంలో ఏం జరుగుతుందో తెలీదు."

"సరే... సరే... బ్యాంకు ఎలా పెట్టాలి? ఏం చేయాలి? పెడితే మనకేం లాభం?"

"అన్నీ విషయాలు చెబుతాను గాని. మరి నాకో బెంజ్‌కారు కొనిపెడ్తావా?"

"ఏం కారు?"

"మెర్సిడెస్ బెంజ్ అని చాలా బావుంటుందిలే!"

"మొన్నటిదాక మోపెడో, మారుతీ అనేదానివిగా..."

"పెద్ద ప్లాను చెబితే... పెద్దకారు ఇవ్వవేమిటి?"

"బ్యాంకు దోచినా, బ్యాంకు పెట్టి దోచినా అంతా నీకే గదా! అసలు విషయానికి రా... ఎలా పెట్టాలి బ్యాంకు?"

"సర్కారు వాళ్లు ఇప్పుడు బ్యాంక్ పెట్టడాలు చాలా తేలిక చేసేశారు. ఎవరైనా పెట్టుకోవచ్చు! ముందొక కోటి రూపాయలు పోగెయ్యండి. ఇంతకు ముందు... ఇంతకూడా అవసరం లేకపోయేది. తరువాత మరొక యాభైలక్షలు పోగేయండి... సహకార బ్యాంకు పెట్టేయండి!"

"ఎంత తేలిగ్గా చెబుతున్నావే. ఏదో మా బ్యాంకులో డిపాజిట్టు పెట్టండన్నంత తేలిగ్గా."

"ఇవ్వాళ రేపు కోటిరూపాయలు నథింగ్ మావా!"

"కోటిరూపాయలెందుకు? యాభైలక్షలెందుకు?"

"మొదటిది మూలధనం... అంటే పెట్టుబడి అన్నమాట... యాభై ఏమో పంపకాలకి"


"ఎవరికీ? మన మధ్యనా?"

"ఏంటి మావ! ఇంత జనరల్ నాలెడ్జి లేకుండా పోయింది. సహకారశాఖవారికి, రిజర్వు బ్యాంకువారికి, తోడునీడగా ఉండేందుకు మీకు తెలిసిన రూలింగ్ పార్టీ పెద్దలకు గీతాలివ్వాలి ప్రతినెలా!"

"ఎందుకు?"

"నీకు పోలీసు మామూళ్లు ఇవ్వటం తప్ప... ఇంకోటి తెలియదు. వీళ్లందరి సహకారం లేకుండా మనం అనుకున్నట్లు నడవడం చాలా కష్టం మావ, అవన్నీ తర్వాత చెబుతాలే గాని. మనతోటి దొంగలెవరెవరున్నారు? వాళ్లను తోడు దొంగలుగా మార్చుకోవాలి!"

"వైజాగ్‌లో దొంగతనాలు చేస్తున్న మిత్రులు ఇద్దరుండేవారు. చాలా నమ్మకస్థులులే. మన ఊరు గుడివాడలో ఒకరున్నారు. మిగతావారు




నీవూ, నేనూ, మా తమ్ముడు, మా చెల్లెలు..."

"వెరిగుడ్... వెరీగుడ్... కాని నేవద్దులే మావా... ఎటుపోయి ఎటొచ్చినా అరెస్ట్ కాకుండా డబ్బుకు కాపలా కాయటానికి ఒక మనిషి ఉండద్దూ!"

"మరి ఈ శాఖల వాళ్లందరికి ఎందుకు?"

"సహకారం కోసం సహకారశాఖకు, నీవెవరో నీ బ్యాక్‌గ్రౌండేమిటో తెలియకుండా తెలుసుకోకుండా లైసెన్స్ ఇవ్వటానికి ఆర్బీఐ వారికి...."

"అవును సుమా! చిట్‌ఫండ్ కంపెనీలు పెట్టి బోర్డు తిప్పేశామని తెలిస్తే లైసెన్స్ ఇవ్వరేమో?"

"అందుకేగా ఇమ్మంటున్నది? పైగా ఈ సహకారబ్యాంకులు పెడుతున్నది ఎవరు? రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూ కబ్జా ప్రబంధులు, స్టాక్ బ్రోకర్లు, బ్లాక్ మనీ ఉన్న అధికారులు, దొంగసారా వ్యాపారులు, రాజకీయ నాయకులు..."

"మరి ఎమ్మెల్యే ఎంపీలకెందుకు?"

"నీది మరీ చాదస్తం మావా! వాళ్ల సపోర్టు లేకుండా ప్రజల డబ్బు దోచుకుందామనే?"

"సరే సరే... బ్యాంకుకు ఏం పేరు పెడదాం? ఏ ఊరిలో పెడదాం? ఆ ఊరిలో ఎక్కడ పెడదాం?"

"మంచిపేరు ఆలోచించాలి. ఈజీగా ఉండాలి. క్యాచీగా ఉండాలి"

"ఊఁ... తార, సితారా, స్వాహా, గోవిందా, మాధవా, కేశవా..."

"ఊ ఇవన్నీ షట్టర్లు దింపిన బ్యాంకులే..."

"శ్రమా బ్యాంక్, కృషి బ్యాంక్, లేబర్ బ్యాంకు, ప్రజా..."

"ఇవీ మూతపడ్డవే!"

"ఈశా, మహేశా, వాసవీ, సాయి, రామా, కృష్ణా..."

"ఇవ్వన్నీ దేవుళ్ల పేర్లు!"

"కాస్మోపొలిటన్, మెట్రోపొలిటన్, బెనారస్, సికిందరాబాదు, హైదరబాదు..."

"నోరు తిరగలా.. పైగా ఇవన్నీ ఊర్ల పేర్లు!"

"చార్మినారు, కుతుబ్ మీనారు, గోల్కొండ..."

"ఇవన్నీ కట్టడాలు..."

"ఇక నావల్ల కాదుగాని. నీవే చెప్పు!"

"చెబితే నాకేమిస్తావు?"

"అదేదో కారు అన్నావుగా. ఇంకేం కావాలి?"

"మా తమ్ముడిని కూడా డైరక్టర్‌ను చెయ్యాలి. వాడికొక కారు, బంజారాహిల్స్‌లో ఒక ప్లాటు కొనిపెట్టాలి. చక్కని పిల్లనిచ్చి పెళ్లి చెయ్యాలి..."

"ఓకే గాని... మంచిపేరు సజెస్ట్ చేయి మరి!"

"ఈ మధ్యన హిట్టైన సినిమాల పేర్లు చెప్పండి చూద్దాం!"

"పోలీస్, వాడే పోలీసు, వీడే పోలీసు, వాడే రౌడి, వీడే రౌడి, ఎవడ్రా రౌడి..."

"ఇటు వంటివి ఎవరైనా పెడతారా?"

"నువ్వూ నేను, నువ్వే కావాలి, నువ్వే ప్రపంచం... నువ్వే నా సర్వస్వం, నువ్వే నా నవ్వు, నువ్వే నా లవ్వు..."

"ఛీ... ఛీ... ఇవి కథలకు, సినిమాలకు పెట్టే టైటిల్స్‌గాని బ్యాంకులకు పెట్టేవా?"

"అంతం, రాత్రి, హత్య, దాదా, దోపిడీ..."

"ఖర్మ! ఎప్పుడూ ఇదే గొడవా? ఇంకొంచం ఆలోచించండి! మరో పేరు కోసం...

"రుషీ, ఖుషీ..."

"ఆపండి... ఆపండి పేరు దొరికింది!"

"రుషీ బ్యాంకా?"

"కాదు ఖుషీ బ్యాంక్!"

"ఆఁ... ఎలా ఉంది పేరు?"

"ఫస్ట్ క్లాస్... అయితే ఈ పేరే ఖాయం చేసేయండి. ఖుషీ సహకార బ్యాంకు. బోర్డుకు ఆర్డరివ్వండి."

"ఎక్కడ పెడ్దాం?"

"శ్రీకాకుళంలోనో, ఆదిలాబాదులోనో, పోలీసులో, యంపీలో తెలిసని పెడితే ఏం గిట్టుబాటవుతుంది? అందుకని భాగ్య నగరం బెస్ట్!"

"మరి ఎక్కడ పెడ్దాం?"

"ఎక్కడేమిటండి? బుద్ధుడి విగ్రహం ప్రక్కకో, ట్యాంక్‌బండ్ కబ్జా చేసి అక్కడో జోన్స్ వదిలేస్తే... జంటనగరాల మధ్య ప్రదేశం ఏది? రాణిగంజ్.. అక్కడ అన్నీ వ్యాపారసంస్థలు, షాపులే... ఏదైనా బిల్డింగ్ చూసి ఎడ్వాన్స్ ఇచ్చిరండి. అన్నట్లు బ్యాంకు బోర్డు గవర్నమెంట్‌వారి రూల్ ప్రకారం ఇంగ్లీషు, తెలుగు, హిందీలలోనే కాకుండా వ్యాపారులకు "కాచ్" చేయటానికి గుజరాతీ, మార్వాడీ భాషల్లో కూడా వ్రాయించండి... అన్నిటికన్నా మన పేర్లతో మరో బ్యాంకులో ఎకౌంట్ తెరవండి..."

"నీకెన్ని విషయాలు తెలిసే? బ్రైయిన్ ప్లస్ బ్యూటీ కలవడం అంటే ఇదే మరి! ఇవాళ్ల రాత్రికి ఏదైనా షాపు షట్టరు లేపి... రేపు ఫైవ్‌స్టార్ హోటల్‌కు తీసుకెళ్తాలే..."

"థాంక్యూ మావా! మరో విషయం. నన్ను బెడ్‌రూంలో తప్ప చంద్రీ అని పిలవకూడదు. బయట చంద్రికాదేవి. నీవు కూడా వెంకయ్యవుకావు. రేపటినుంటి కోనరాజు వెంకట్రావువి. బంజారాహిల్స్‌లో మంచి ఇల్లు అద్దెకు తీసుకో... ఈ మురుగుకాలవల ప్రక్కన చచ్చిపోతున్నాం. కరంటు పోవడం, ఏసీలు ఆగటం ఉండదు. నీవు నాలుగైదు రీజెంట్ టైలరు సూట్లు కొనుక్కో. జోడాయక్ టైలు కొనుక్కో. రిబోక్ షూలు కొనుక్కో... నాకొక అరడజను పట్టుచీరలు కొనుక్కురా. అన్నీ క్విక్‌గా ఫాస్ట్‌గా జరిగిపోవాలి సుమా..."

"ఓకే...!"

"ఇందాక అన్నావే. రేపు స్టార్ హోటల్‌కు తీసుకెళ్తానని. సారీ... రేపే గాదు ఇక నుంచి మనకు డబ్బే డబ్బు గదా! బ్యాంకు పెట్టాక బ్రేక్‌ఫాస్ట్ నుంచి డిన్నర్‌దాకా అక్కడ నుంచే తెప్పించాలి..."

"ఓకె... డబుల్ ఓకె... ఇక చూసుకో నాతడాఖా...."

000

రెండేళ్ల తరువాత!

"ఎలా ఉంది వెంకట్రావ్‌గారు బ్యాంకు వ్యాపారం?"

"ఇక్కడ కూడా ఆ పేర్లేందుకు గాని... చాలా గొప్ప సలహా ఇచ్చావే చంద్రీ... మంచి సెంటరేమో! డిపాజిట్లు కుప్పలు తిప్పలుగా వచ్చిపడుతున్నాయి. బిజినెస్ వాళ్లు, బ్లాక్‌మనీ ఉన్నవాళ్లు అంతా... మన దగ్గరే పెడుతున్నారు. మిత్రులు, పార్లమెంట్ మెంబర్సు గూడా మన దగ్గరే పెడుతున్నారు వారి డబ్బంతా! నీవు నిజంగా గ్రేటే!"

"నా సలహా అంటే ఏమనుకున్నావు మరి? ఇంకొక చిన్న కోరిక కోరనా?"

"నీవు కోరడం ఏమిటే... బ్యాంకునీది... బ్యాంకులో డబ్బు నీది!"

"ఏం లేదు వెంకీ! ఈ బోరు వాటరు నాకు పడక... నా స్కిన్ చూడు ఎలా నల్లబడుతుందో... అందుకని రేపటినుంచి త్రాగటానికే గాకుండా స్నానానికి కూడా మినరల్ వాటర్ తెప్పించాలి"

"ఇంతేనా?"

"ఇంతే గాదు. ఉన్న ఒక్క బెంజికారు నీవు వాడుతున్నావు. ఫలానా ఖుషీ బ్యాంక్ ఛైర్మన్‌గారి భార్య మారుతీలో తిరుగుతుంటే ఎంత నామర్దా! అందుకని నాక్కూడా ఒక బెంజ్‌కారు కొనిపెట్టాలి!"

"ఓస్... ఇంతేనా రేపే ఆర్డరిద్దాం. దానికేం భాగ్యం? ఇవాళ్లే పోలీస్ డిపార్ట్‌మెంట్ డిపాజిట్లు గూడా వచ్చాయి. రిటైరయ్యాడు చూడు స్వరాలో, స్వరాగాలో ఏదో పేరుండాలి. పోస్టల్ డిపార్టుమెంట్ డైరక్టరుగా చేశాడు. ఆయన కూడా ఇవాళ్లే ఒక యాభై లక్షలు పెట్టాడు. ఇంకో పెద్దపోలీసాయన కూడా పెట్టాడులే... ఆఁ అన్నట్లు పోలీసులంటే గుర్తొచ్చింది. మా చెల్లెలు ఉంది చూడు... మన డైరక్టర్ సుమతి... దాని పెళ్లికి వచ్చారే ఒక ఎసిపిగారు, మినిస్టర్లతో బాటు. రేపు వాళ్లింట్లో వాళ్ల అబ్బాయి పెళ్లి రిసెప్షన్... ఆయన లోపయకారిగా మన పార్టనర్ కూడాలే... ఏదైనా ఘనంగా ఇవ్వాలి..."

"ఏమిద్దాం?"

"ఆల్‌రెడీ... వాళ్లబ్బాయి కంప్యూటర్ ప్రోగ్రామర్‌గా...మంచిజీతంతో అపాయింట్ చేశాను. కాబట్టి రిసెప్షన్‌లో పెళ్లికూతురికి ఇవ్వాలి."

"అయితే సింపుల్‌గా ఒక మంచి ఖరీదైన పట్టుచీర కొని ప్రజంట్ చేద్దాం!"

"వెరిగుడ్... అయిడియా బావుంది. రేపు కొంటానికి వెళ్లినప్పుడు నాకొక ఖరీదైన సూట్‌కూడా కొనుక్కురా!"

"అవునుగాని వెంకీ... మనవూళ్లో కడ్తున్న ఇల్లు ఎంతవరకు వచ్చింది? ఎంతయింది?"

"ఓస్.. ఎంతోనా? మహా అయితే ఓ హాహటయ్యి ఉంటుంది. కంప్లీటయి పోయిందిలే... కాస్త ఫ్రీగా ఉన్నప్పుడు చూసొద్దాం. నాన్నగారి పేరుతో పెట్టేశాలే అది."

"మంచి పని చేశావు వెంకీ... అదే ఇక్కడయితే ఎంత బావుండేది?"

"ఇక్కడా... కొంటున్నాగా... పైగా ఇక్కడయితే అందరి దృష్టిలో పడదూ. నాకోరిక ఉండేది అది కూడా తీరింది.... అసలు నాకు చిన్నప్పటినుంచి కష్టపడకుండా పైకి రావాలని, ఏదోవిధంగా డబ్బు సంపాదించాలని, ఖరీదైన డ్రస్సులు వేసుకోవాలని, ఇల్లు, తోటలు, బంగళాలు, కార్లు, షేర్లు... కొనాలని చాలా ఇదిగా ఉండేది... నీ సలహా పుణ్యామా అని... అన్నీ తీరాయి"


"మరి బోర్డు తిప్పేద్దామా?"

"ఇంకొన్ని బంగారు గుడ్లు పెట్టాక!... పైగా ఇవాళో రేపో కుతుబ్‌మినార్ బ్యాంక్ వాళ్లు పదిహేనో ఇరవైయో పెడతామంటున్నారు. వడ్డీ ఒక్కశాతం ఎక్కువిస్తే చాలు."

"వెంకీ! డిపాజిట్లు పెరగడానికి ఇంకొన్ని ఉపాయాలు చెప్పనా?"

"చెప్పు మరి. కన్సల్టెంటని నీకు నీకు నెలకు లక్షరూపాయలు ఇస్తున్నందుకైనా చెప్పాలి"

"ఏ సహకార బ్యాంకు, ఏ ప్రభుత్వ, ప్రవేట్



బ్యాంకులు కూడా ఇవ్వనంత వడ్డీ ఇస్తున్నట్లు ప్రకటించండి. అంటే పదిహేనో పదహారోశాతం అన్నమాట"

"అమ్మో! దేశంలో అత్యంత పెద్దబ్యాంకు స్టేట్‌బ్యాంకే తొమ్మిది శాతం దాటి ఇవ్వటం లేదు."

"వర్రీ అవకు వెంకీ! మనం ఇచ్చేదా చచ్చేదా! నే చెప్పినట్లు చేయండి."

"సరే సరే.. చెప్పు!"

"ఫిక్సడ్ డిపాజిట్లపై అందరికి 15శాతం అని, కావాలని రిటైర్మెంట్ తీసుకున్నవారికీ, పెన్షనర్లకు 16 శాతం అని అన్ని పేపర్లలో కలర్‌లో ప్రకటనలు వేయించండి. కోటి రూపాయలు పోతేపోయాయనుకొని ఊరంతా బోర్డులు పెట్టించండి. కటౌట్లు పెట్టించండి. టీవీలో యాడ్‌లివ్వండి. బ్రహ్మాండమైన పబ్లిసిటి ఇవ్వండి. ఇక చూడండి వడ్డీ ఆశతో బ్యాంకుల్లో పని చేసేవాళ్లు గూడా పరుగెత్తుకొస్తారు. అన్నట్లు మీరు కొన్ని కోట్లు ఇన్‌కంటాక్సు కట్టినట్లుగా ప్రజలకు తెలిసేలా చేయండి."

"అయినా... నేనెప్పుడు కట్టాను?"

"ఊరికేనా....ఊరికే ఇంత ఖర్చు చేస్తే ఆర్బీఐవాళ్లు ఊర్కోరేమోనే?"

"రెండేళ్ల నుంచి బ్యాంకు నడుపుతున్నారు. ఆ మాత్రం తెలీదా? సహకార శాఖకు, ఆర్బీఐకు, ఎలక్షన్ ఫండ్ అని చెప్పి మంత్రిగారికి సూట్‌కేస్‌లు పంపించండి."

000

మరో సంవత్సరం తరువాత:

ఎక్కువ వడ్డీ రేట్ల ప్రలోభం, బ్రహ్మాండమైన పబ్లిసిటీ, ఎంతైనా ఎక్కడిది అని అడక్కుండా ఎవరి పేరుతోనైనా డిపాజిట్లు అంగీకరించడం. ఇళ్లకెళ్లి సర్వీసు చేయడం, ఛైర్మన్ అత్యంత నిజాయితీపరుడుగా ప్రకటించుకోవడం. మూడువందల అరవై రోజులూ ఇరవై నాల్గు గంటలు తెరిచి ఉంచడం లాంటి గిమ్మిక్స్ వలన ఖుషీ బ్యాంకు మేడిపండులాగా మెరిసిపోతూనే ఉంది.

రిటైర్మెంట్ తీసుకున్నవాళ్లు, మిగతా బ్యాంకులలో దాచుకున్నవాళ్లు, భర్త జీవితభీమా డబ్బులు వచ్చిన విధవాడపడుచులు. బినామిపేర్లతో పార్లమెంట్ మెంబర్లు, బ్లాక్‌మనీ ఉన్న బిజినెస్ వర్గాలు, అప్పనంగా ప్రజల నుంచి ప్రభుత్వం నుంచి ఎడాపెడా దోచేసిన ఉన్నతాధికారులు, ప్రస్తుతం పదవుల్లో ఉన్నవారు, మంత్రులూ... ఖుషీ బ్యాంకు ఖజానా నింపేశారు.

బ్యాంకు మూడు పువ్వులూ, ఆరు కాయలుగా నడుస్తున్నకాలంలో....

000

మరో మూడు నెలల తరువాత:

బ్యాంకులో డబ్బంతా స్వంతానికి, షేర్లలో పెట్టుబడికి, స్థిరాస్తులు కొంటానికి ఛైర్మన్‌గారు వాడేస్తున్నారని తెలుసుకొని ఆర్బీఐ ఆర్డరు చూసి కుతుబ్‌మినార్ బ్యాంక్ వాళ్లు వాళ్ల ఇరవై కోట్లు వెనక్కు తీసేసుకున్నారు. అందువల్ల....

మరో వారం తరువాత:

సెప్టెంబరు పదకొండు అమెరికాకు బ్లాక్‌డేగా అయినట్లు ఖుషీ బ్యాంక్ ఖాతాదారులకు కూడా ఒక బ్లాక్‌డే వచ్చింది ఎందుకంటే... చిత్తగించండి.

"మాడబ్బు మాకు కావాలండి... ఇప్పుడే కావాలి..." ఖాతాదారుల గొడవ.

"ఇస్తామండి... ఎక్కడకు పోయింది మీ డబ్బు. ఇంత క్యాష్ దగ్గర పెట్టుకుంటామా?" బ్యాంకు మేనేజరు మారుతీ అదిరింపు.

"ఇవ్వండి... మీరు నిన్నొమొన్నో అందరకూ ఇచ్చారటగా... పైగా బ్యాంకులో డబ్బు లేదటగా"

"ఎవరండి చెప్పింది? ఇంకో బ్యాంకుల్లో, ఆర్బీఐలో పెడతాము. ఇవాళ్ల శనివారం రేపాదివారం. ఆ బ్యాంకులు పని చేయవు. సోమవారం రండి. మీ అందరికి ఎవరికి కావాలంటే వారికిస్తాము. భయపడాల్సిందేమీ లేదు"

చినుకుచినుకు వరదలా అయినట్లు ఖాతాదార్లు పదులు వందలూ వేల సంఖ్యలో బ్యాంకుకు వచ్చారు. తాము కష్టపడి సంపాదించి దాచుకున్న డబ్బు వెనక్కు తీసుకోవాటానికి. బ్యాంక్ మీద "రన్" ప్రారంభమైంది. పోలీసులు రంగప్రవేశం చేశారు. మేనేజరుకు, అక్కడ పారిపోకుండా మిగిలిన సిబ్బందికి, ఫర్నీచర్‌కు, కంప్యూటర్లకు రక్షణ కల్పించటానికి.

"ఎందుకండి వర్రీ అవుతారు. మా ఛైర్మన్‌గారు అమెరికా వెళ్లారు. డిపాజిట్లు సేకరణకే--రెండురోజుల్లో వచ్చేస్తారు. అంతవరకు మీకు మా ఖాతా ఉన్న ఎఫ్.జీ.హెచ్చై బ్యాంకు మీద పే ఆర్డర్లు ఇస్తాంగా... వెళ్లి అక్కడ కాష్ చేసుకోండి. ఇప్పుడా నేనొక్కడినే ఉన్నాను. మాది 'ఏ'గ్రేడు సహకార బ్యాంకు తెలుసుగదా మా ఛైర్మన్‌గారు ఎంత నిజాయితీపరుడో తెలుసుగదా ఆదివారం కూడా మాకు వర్కింగ్‌డే అదీ తెలుసు గదా రేపురండి" డిపాజిటర్లకు మేనేజరు అభ్యర్థన.


"పొండి పొండి లాయండార్డర్ ప్రాబ్లం చేయకండి... అందరూ రేపు రండి. పొండి... పొండి" బిచ్చగాళ్లను విదిలించినట్లు పోలీసుల కసురులు... ఆ శనివారం అలా గడచిపోయింది. అమాయక ఖాతాదారులు మర్నాడు, ఆ మర్నాడు కూడా వచ్చారు. వేసి ఉన్న షట్టర్లు కాపలా ఉన్న పోలీసులు తప్ప ఏం కనబడలేదు. డబ్బిస్తామని చెప్పిన మేనేజర్ లేడు. ఫారిన్ వెళ్లాడని నమ్మబలికిన ఛైర్మనూ లేడు. ఈ అమాయక డిపాజిటర్లు ఇంకా అమాయకంగా పోలీసులనాశ్రయించారు.

పోలీసులు వాళ్లకున్న ప్రాబ్లమ్‌వలనో "ఆబ్లిగేషన్'ల వలనో మరో మూడురోజుల తరువాత మాత్రమే కేసు బుక్ చేసుకున్నారు. ఆ మూడురోజుల్లో ఛైర్మన్, డైరక్టర్లు ఉన్నదీ, అందింది పది కోట్లు పదిసూట్‌కేసుల్లో నింపుకుని ఉడాయించారు.

అసలు సంగతి పసిగట్టిన పేపర్లవాళ్లు, టీవీ ఛానెల్స్‌వాళ్లు హైలెవెల్లో హడావడి చేసేసరికి కుంభకర్ణుడికి తమ్ముళ్లైన ప్రభుత్వ సహకారశాఖలో, ఆర్బీఐలో, హోంశాఖలో, ముఖ్యమంత్రి పేషీలో కొంత చలనం వచ్చింది.

"వాళ్లు ఎంత పెద్దవాళ్లయినా, ఎంత పలుకుబడి ఉన్నవారైనా పట్టుకుని శిక్షించి అందరికి న్యాయం చేకూరుస్తానని" ముఖ్యమంత్రి తన తరహాలో మనవి చేసుకున్నారు. అంతే ఫోర్సుతో అన్ని శాఖల మీద మండిపడ్డారు.

"అసలా బ్యాంకులో వడ్డీ ఆశకు పోయి జమ చేయడమే పెద్ద తప్పని" పోలీసు కమీషనర్‌గారు కోపడ్డారు. వారిశాఖ నిధులు కూడా పెట్టారని తెలీక. అయినా నేరస్థులను పట్టుకుంటాను" అని



పత్రికలవాళ్లకు స్టేట్‌మెంటిచ్చారు.

"మీకెందుకు కేంద్ర ఆర్థిక మంత్రితోనూ, ఆర్బీఐ గవర్నర్‌తోనూ మాట్లాడతాగా!" అని మరో కేంద్రమంత్రి ధైర్యం చెప్పారు.

"అసెంబ్లీ ఈ సమస్య మీద ప్రభుత్వాన్ని ఎండకడ్తాంగా" అని ప్రతిపక్ష నాయకులు బీరాలు పలికారు.

"తప్పు మీదంటే మీదని" సహకారశాఖ వాళ్లు ఆర్బీఐ వాళ్లు వొకరిమీద వొకరు పబ్లిగ్గా బురద జల్లుకున్నారు.

ఎవరేం అరచినా, ఖాతాదారులు ఎంత మొత్తుకున్నా ఫలితం మాత్రం శూన్యం! పోలీసు కమీషనర్ నిజంగానే పట్టుకుంటాడేమో భయమేసి కేసును సర్కారువారు సిఐడీశాఖకు బదిలీ చేశారు

రకరకాల ఆడిట్లు, ఎంక్వైరీలు ఖాతాదారులు, పత్రికల వాళ్లు లాగిన కూపీలలో బయటపడ్డ విషయాలు చదువుతుంటే నిర్ఘాంతపోయి చేష్టలుడిగి చూడటం తప్ప ఎవరూ ఏం చెయ్యలేకపోతున్నారు.

అసలు బ్యాంక్ ప్రజలకు శఠగోపం పెట్టడానికే పెట్టారు.

చైర్మనూ, డైరక్టర్లు నేరచరితులని తెలిసో నిజంగా తెలియకో బ్యాంకు పెట్టడానికి లైసెన్స్ ఇచ్చారు. (బ్యాంకులో అటెండర్ ఉద్యోగానికి కూడా పోలీసు ఎంక్వైరీ రిపోర్టులు కావాలి).

"సహకారశాఖవాళ్లు, ఆడిట్‌లో బ్యాంక్ లావాదేవీల్లో భయంకరమైన అవకతవకలున్నా ఆర్థికనేరాలు కనిపిస్తున్నా సూట్‌కేసులు అందుకుని వారివంతు సహకారంగా బ్యాంకుస్థాయి 'ఏ' గ్రేడ్‌కు పెంచారు.

ప్రజల డబ్బంతా జూదంలాంటి షేర్ మార్కెట్లో పెడ్తుంటే, కోట్లలో చైర్మన్, డైరక్టర్లు రకరకాల బీనామి పేర్లతో బీనామి లోన్లు తీసుకుని గుటకాయస్వాహా చేస్తుంటే, పబ్లిగ్గా పబ్లిసిటీ ఇచ్చి ఎక్కువ వడ్డీ ఇవ్వజూపుతుంటే, ప్రమాదం పొంచివుందని, ఏ క్షణంలోనైనా ఖాతాదారుల కొంపలు అంటుకుంటాయని, అర్నెల్ల ముందే తెలిసి ప్రజలను హెచ్చరించాలన్న ధ్యానం, ధర్మంలేని తమ వంతు సహకారంగా బ్యాంకు మేనేజ్‌మెంట్‌ని మాత్రం చాలా సౌమ్యంగా హెచ్చిరించి వేసిన పెనాల్టిని రద్దు చేశారు ఆర్బీఐవారు.

చైర్మన్ కోనరాజు వెంకట్రావు ఎన్నోపేర్లతో, ఎన్నోవూర్లలో ప్లాట్లు, ఫ్లాట్‌లు, తోటలు, షేర్లు, కార్లు, ఇండస్ట్రీలు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు కొన్నారు.

డైరక్టర్లు కూడా (వీరెవరో కాదు చైర్మన్‌గారి అత్యంత అస్మదీయులు) బోగస్ కంపెనీలు, ముప్పైకోట్లవరకు లోన్‌ల వంకతో ప్రజల డబ్బు "నొక్కేశారు".

బ్యాంకు రూల్స్ ప్రకారం డిపాజిట్లలో కొంతభాగం వేరే బ్యాంకులోగాని, ఆర్బీఐలోగాని జమ చేయాలి. అది తీయడానికి వీల్లేదు. అది కూడా విత్‌డ్రా చేసుకున్నారు.

మరికొన్ని రోజులు పోయాక:

పారిపోయిన నేరస్థులలో అంటే డైరక్టర్లలో చాలామంది (కావాలని) పట్టుబడటమో, లొంగిపోవటమో చేశారు. వీళ్లందరూ చిన్న ఎక్వారియమ్ చేపలు, అసలు షార్కులు చైర్మన్ ఆయన చెల్లెలు అండర్‌గ్రౌండ్‌లోకి, తప్పించుకుని తిరుగుతూనే ఉన్నారు. పోలీసులు, రాజకీయనాయకుల సహకారంతో--అని పబ్లిక్ పబ్లిక్‌గానే చెప్పుకుంటున్నారు. పేర్లతో సహా పత్రికలు వ్రాస్తున్నాయి.

దొరికినవారిని కోర్టులో ప్రవేశపెడితే వారికి రాచమర్యాదలు చేయాలని పోలీసులకు జడ్జీగారు తాఖీదిచ్చారు.

బ్యాంకుని పునరుద్ధరిస్తే తమ పేర్లు బయటకు వస్తాయనే భయంతో అసలు బ్యాంకునే టోటల్‌గా మూయించాలని పెద్దలు ప్రయత్నిస్తున్నారని వార్తలొస్తున్నాయి. ప్రజల డబ్బు చాలావరకు ప్రభుత్వశాఖలతో ఇప్పించి చైర్మన్‌తో కలసి పంచుకోవాలని కొందరి ఆలోచన అని ఆరోపణలు వస్తూనే ఉన్నాయి.

అసెంబ్లీలో ఖుషీ బ్యాంకు గురించి చర్చించకుండా స్పీకరు తమ వంతు సహకారం అందించారని ప్రతిపక్షంవారూ, లేదు వీరికే చిత్తశుద్ధిలేదని అధికారపక్షంవారు ఆరోపించుకున్నారు.

ఖుషీబ్యాంకులో దాచుకున్న డబ్బు దోచుకోబడ్డవారివి ఎవరి కన్నీటిగాథలు వారివి. వీరందరూ చిరునవ్వు మరచిపోయారు, కంటిమీద కునుకు మరచిపోయారు. కడుపు నిండా తినటం మరచిపోయారు.

వీరందరూ బ్యాంకు చుట్టూ మంత్రుల చుట్టూ ప్రభుత్వ అధికారుల చుట్టూ పనికిరాని డిపాజిట్ రసీదులు పట్టుకుని తిరుగుతూనే ఉన్నారు. నేరస్థులని పట్టుకోవాలని, వారిని శిక్షించాలని, తమ డబ్బు వాపసు ఇవ్వాలని సమావేశాలు జరిపి డిమాండు చేస్తూనే ఉన్నారు.

ఈ రోజు సంగతి:

షరా మామూలే. అసలు నేరస్థులు వారు దోచుకున్న కోట్లాదిరూపాయలతో హాయిగా పరారీలోనే ఉన్నారు. మాఫియాగ్యాంగులను, విదేశ గూఢచారి సంస్థలను అవలీలగా పట్టుకునే పోలీసువారికి ఈ ఆర్థికనేరాల టెర్రరిస్ట్‌లు ఇంకా దొరకనేలేదు(ట).

దాచుకున్న డబ్బుకోసం ఖాతాదార్లు, దోచుకున్న డబ్బుతో బ్యాంకు డైరక్టర్లు, వాళ్లని పట్టుకోవాలని పోలీసులు, వాళ్లని పట్టుకోనీయకుండా నాయకులు పరుగెడుతూనే ఉన్నారు.

చివరగా నా మాట:

ఈవిధంగా ప్రజలకు మధ్యపెట్టే మోసం చేసే బ్యాంకుల చైర్మనులు వారి తొత్తు డైరక్టర్లు వారికి సహకార సహాయాలు అందించే వివిధ శాఖల అధికారులు రాజకీయనాయకులు హంతకులకన్న భయంకరులు, దేశద్రోహులకన్నా నీచులు, ఒళ్లమ్ముకుని పొట్టపోసుకునే వేశ్యలకన్నా నికృష్టులు. కడుపుకు కూడా తినకుండా పొదుపు చేసుకున్నవారు... ఇకనుంచైనా జాగ్రత్తపడి ప్రొద్దునకల్లా బోర్డులు తిప్పేసే బ్యాంకులలో డబ్బు పెట్టకుండా జాగ్రత్తపడాలి. మేరా భారత్ మహాన్ హై! తస్మాత్ జాగ్రత్త!

(రోజుకో సహకార బ్యాంకు మూతపడుతున్న వార్తలు చూసి....)

